

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 7 పుష్పం : 9 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 25-11-98,భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు సుబ్రహ్మణ్యషష్టి. ఆంధ్రులు రామచంద్రమూర్తిని ఎలా తలచుకొంటారో తమిళనాడు వారు అందరూ సుబ్రహ్మణ్యస్వామిని అలాతలచుకొంటారు. వారికి ఇష్టదేవత మురుగ అంటే సుబ్రహ్మణ్యుడు. సుబ్రహ్మణ్యునికి ఇంకొక పేరు శివగురువు. ఓంకారము యొక్క స్వరూపాన్ని శివునికి బోధించి శివగురువు అయ్యాడు. సుబ్రహ్మణ్యుని మంత్రం శరవణభవ. శరవణము అనే తటాకములో శివుడు యొక్క తేజస్సు సుబ్రహ్మణ్యరూపం దాల్చింది కాబట్టి శరవణభవ అని పిలుస్తారు. మానవుడి యొక్క ప్రవర్తనవాడి స్వభావాన్ని బట్టి ఉంటుంది. దేహప్రారబ్ధాన్ని బట్టి ధనంరావచ్చు. అధికారం రావచ్చు, కీర్తి, రావచ్చు కాని మానవుని, స్వభావం మార్చుకోవటం చాలాకష్టం. ఎంతోసాధన చేస్తేనే గాని, బ్రతికి ఉండగా కాలిపోతేనే గాని మానవుని స్వభావం మారదు. స్వభావం మార్చుకోవటం అంటే నాతోటినేను పోరాడటం. మానవుడి యొక్క మనస్సు వాడి స్వభావాన్ని బట్టి పనిచేస్తుంది. పూర్వజన్మలో ఏవైనా మంచి పనులు చేసి ఉంటే ఈజన్మలో పుణ్యవాసనలు వస్తాయి. ఏవైనా చెడ్డపనులు చేసి ఉంటే ఈజన్మలో పాపవాసనలు వస్తాయి. మనిషికి వచ్చే ఆలోచన, చేసే పని పూర్వజన్మ నుండి వచ్చిన వాసనలను బట్టి ఉంటుంది. సాధ్యమైనంతవరకు మన మనస్సును శాంతిగా ఉంచుకోవాలి. మనస్సును శాంతిగా ఉంచుకొంటే మనకు మంచి ఆలోచనలు, మంచి తలంపులు వస్తాయి. అవి శారీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.

మనందరికి సుఖపడాలని ఉంది కాని సుఖం రోజూ ఉండదు. ఒకవేళ ఈరోజు సుఖంఉన్నా అది పోతుంది. అలాకాకుండా నిరంతరము, నిత్యము మీశాంతికి ఒక్క నిమిషం బ్రేకులేకుండా సుఖం మీరు అనుభవిస్తూ సుఖస్వరూపంలో ఉండగలిగితే అదేమోక్షం. మోక్షంలో సుఖము, శాంతి, ఆనందము ఉంటుంది. ఆస్థితి మీరు పొందితే మీకు శరీరం ఉన్నా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే అసలు మరణం గురించి మీకు ధ్యాసే ఉండదు. దేవతాపురుషులను ఆరాదిస్తే, ఉపాసనచేస్తే మోక్షం పొందటానికి వారు మనలను అనుగ్రహిస్తారు. సుబ్రహ్మణుడికి గుహేశుడు అని ఒకపేరు ఉంది. అంటే హృదయగుహలో ఉన్న ఈశ్వరుడు. ఈశ్వరుడు అంటే ప్రభువు, నియమించేవాడు. మీ ఇంటికి ఒకయజమాని ఎలా ఉన్నాడో అలాగ ఈఖగోళం అంతకీ యజమాని ఉన్నాడు, వాడే ఈశ్వరుడు. ఈశ్వరశబ్దం రాముడికి, కృష్ణుడికి, సుబ్రహ్మణ్యుడికి అందరికి వరిస్తుంది. ఆయన హృదయగుహలో ఉండి నీదేహప్రారబ్ధాన్ని బట్టి

ఆడిస్తూ ఉంటాడు. నీతల్లి గర్భంలో నుండి శరీరం బయటపడిన తరువాత నువ్వు ఎన్ని శ్వాసలు తీసుకోవాలి, ఏరోజున నువ్వు ఈశరీరం విడిచిపెట్టాలో నీదేహప్రారబ్ధాన్ని బట్టి నియమిస్తూ ఉంటాడు. ఒకమాట జ్ఞాపకం పెట్టుకోండి. మీకు సాధనచేసే శక్తి ఉంటే చెయ్యండి. సాధనచేసే శక్తి లేకపోతే సత్పురుషులతో సహవాసం చెయ్యండి. దానివలన మీరు తక్కువ ప్రయత్నం తోటి ఆధ్యాత్మికంగా ఎక్కువలాభం పొందుతారు.

విషయజ్ఞానం మనపొట్టకు ఉపయోగపడుతుంది. విషయజ్ఞానం అంతా అజ్ఞానమే. విషయ జ్ఞానం అంటే ఏదోవృత్తి నేర్చుకొంటాము. ఆవృత్తి ఎంతవరకు నిజం అంటే నీదేహం ఎంతనిజమో, నీకళ్ళకు కనిపించే ఈప్రపంచం ఎంత నిజమో అదికూడా అంతే నిజం. అదివ్యవహారిక సత్యమేకాని పారమార్థిక సత్యంకాదు. ఆత్మజ్ఞానం మటుకు జ్ఞానం. ఆత్మజ్ఞానం పునర్జన్మ లేకుండా చేస్తుంది. ఎవడైతే నారాయణుడు అని అనుకొంటున్నావో ఆనారాయణుడే వచ్చి ఆత్మజ్ఞానం వలన నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మరణానంతరం కూడా జీవితం ఉంది. క్రియ ఉన్నప్పుడు ప్రతిక్రియ ఉంటుంది. మనఋషులు ఏమని చెప్పారు అంటే క్రియ, ప్రతిక్రియ అనేది పదార్థానికే పరిమితం కాదు, జీవుడికి కూడా అది చెందుతుంది అనిచెప్పారు. నీవు మంచి చేసావా ఆమంచి నీకూడా వెంటాడి అది సుఖం క్రింద మారుతుంది. నీవు ఎదైనా చెడ్డచేసావా ఆచెడు నిన్ను వెంబడించి అది నీకు దుఃఖరూపంలో పరిణమిస్తుంది. ఎప్పుడైతే క్రియ ఉందో అప్పుడు ప్రతిక్రియ ఉండి తీరుతుంది. ఇది కర్మసిద్ధాంతం. ఈసిద్ధాంతం మన అందరికీ అందినా అందకపోయినా శాస్త్రం చెప్పింది, ఈశ్వరుడు చెప్పింది మనం విశ్వసించాలి. ఎందుచేతనంటే అన్నీ మన మెదడుకు అందితే ఇంక భగవంతుడు ఎందుకు.

ఒకమంచి తలంపు మీకు వస్తే ఆతలంపుయొక్క వేగం, ఆతలంపు యొక్క ప్రభావం సమాజం మీదే కాదు ప్రపంచం అంతా పనిచేస్తుంది. ఇతరులు ఉద్రేకంగా మాట్లాడితే తిరిగి మనంకూడా ఉద్రేకంగా మాట్లాడితే మనకు రజోగుణ వికారములు వస్తాయి. ఒకమనిషిని కొలిచేటప్పుడు వాడికి డబ్బు ఎంత ఉంది, కీర్తి ఎంత ఉంది అని బాహ్యవిషయాలను చూసి కొలవకూడదు. వాడి అంతఃకరణము ఎలా ఉంది, వాడి హృదయం ఎటువంటిది అని లోపల విషయాలు చూసి ఆమనిషి యొక్క ఔన్నత్యం కొలవాలి.

నీకు గురువు ఎవరు?నీహితువు, నీక్షేమాన్ని ఎవడైతే కోరుతున్నాడో వాడే నీగురువు ఈసంసారరోగములో నుండి ఈచీకటిలో నుండి విడుదల పొందటానికి నీకు సహాయం చేసేవాడే నీగురువు ప్రతీజన్మలోను తల్లితండ్రులు ఉంటారు, బంధువుల ఉంటారు, స్నేహితుల ఉంటారు, విరోధుల ఉంటారు కాని ప్రతీజన్మలో సద్గురువు దొరకటం కష్టం. నిరంతరము నీదేహం గురించి ఆలోచిస్తూ, నీదేహానికి సంబంధించిన తలంపులే పెట్టుకొంటూ, ఈదేహాన్ని ఎలా సుఖపెడదాము అని ఆలోచించేవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఈరకమైన మనిషి ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేసినా ఏరోజుకారోజు అడ్డంకులు, విపత్తులేకాని వాడు గమ్యానికి చేరుకోలేడు అన్నారు. లోపల నిరంతరము ధనచింతన చేస్తూ, భోగచింతన చేస్తూ ఆత్మజ్ఞానం

కావాలి కావాలి అని అనుకుంటే రాదు. అర్హత, యోగ్యత లేకుండా దానిని పొందలేరు. ఆత్మజ్ఞానం గురించి విన్నంత మాత్రంచేత ఆత్మజ్ఞానము కలుగదు. మీరు శ్రద్దగా వినాలి, వినినదానిని మీరు ఆచరించటానికి ప్రయత్నం చేయాలి. ఎంతవరకు ఆచరించగలరో అంతవరకు ఆచరించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే అది నెమ్మదిగా అనుభవంలోనికి వస్తుంది. మనం చెయ్యగలిగిన పనులు అవి చిన్న పనులు అయినా హృదయపూర్వకంగా ప్రేమతో చేయాలి. అప్పడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము.

ఆత్మజ్ఞానం కలగటానికి సత్పురుషుల సహవాసం, దానం అవసరం. దానం అంటే నీఅర్హతకు మించి పెట్టమనికాదు, నీసంసారమును పాడుచేసుకోమని కాదు నీకు కలిగి ఉన్న దానిలో కొంత ఇతరులకు పెట్టుకోవటం. డబ్బులేకపోతే మనకు రోజు వెళ్ళదు. అలా అని డబ్బుకు బానిసగా నువ్వు ఉండవద్దు. వందరూపాయలు సంపాదించుకొంటే 90 రూపాయలు నీవు అనుభవించు. కనీసం 10 రూపాయలు నీది కాదు అనుకొని ఏదోమంచిపనికోసం, సమాజం కోసం ఉపయోగించు. అలా చేస్తే చాలు నీవు ఇతరులకు ఉపయోగపడినట్లు అవుతుంది. ఈశ్వరానుగ్రహానికి పాత్రుడివి అవుతావు. కొంతమంది మనుషులు బ్రతికే ఉంటారు, అన్నంతింటూ ఉంటారు, గాలిపీల్చుకొంటూ ఉంటారు కాని వారు చనిపోయిన వారితో సమానం అని ఆచార్యులు వారు చెప్పారు. దాని అర్ధం ఏమిటి అంటే అన్నంతింటూ, గాలిపీల్చుకొంటూ ఏదోరోజులువెళ్ళిపోతున్నాయి అని సరిపెట్టుకొంటూ ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేయకపోతే మీరు ఎన్ని సంవత్సరాలు బ్రతికినా చనిపోయినా వారితో సమానం. తినటానికి తిండి ఉంది అని ఈ శరీరం వెయ్యి సంవత్సరాలు ఉంటుందా? ఉండదు. అందువలన నీదేహయాత్రకు సరిపడ పని చేసుకొంటూ ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నం చెయ్యి అంటున్నారు ఆచార్యులవారు. బంధంనుండి నీవు విడుదల పొందటానికి సజ్జనుల సహవాసం నీకు ఉపయోగపడుతుంది. దానం ఎందుకు అంటే దానం వలన కొంత త్యాగబుద్ది అలవాటు అవుతుంది. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు అని రామకృష్ణుడు చెప్పాడు. అందువలన భగవంతుడు ఇచ్చిన దానిలో ఎంతోకొంత పదిమందికి సహాయం చెయ్యి.

ప్రతీ చిన్న విషయానికి బెంగపెట్టుకోకూడదు. మీరు సాధ్యమయినంత వరకు సంతోషంగా, సంతృప్తిగా ఉండండి. ఈలోకంలోనికి ట్రైనింగ్ అవ్వటానికి వచ్చాము. ఏదైనా ఒక మంచి పనిచేసినప్పడు కొంతమంది స్తోత్రం చేస్తారు, కొంతమంది విమర్శలు చేస్తారు. ఎవరి స్వభావాన్ని బట్టి వారు మాట్లాడతారు. వాటిన్ని సమానంగా తీసుకోవాలి. అదికూడ ఒకట్రైనింగ్గా మీరు తీసుకోండి. ఏదిమంచి ఏదిచెడు, ఏది నిత్యం,ఏది అనిత్యం, ఏది సత్యం ఏది అసత్యం అనేటటువంటి వివేకం, విచక్షణ ఎవడికైతే లేదో వాడు మూర్ఖుడు. భౌతికవిద్యల వలన మూర్ఖత్వం పోదు. నువ్వెవడివో నీకు తెలిసినప్పడు, నీహృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు మూర్ఖత్వం నశిస్తుంది. మూర్ఖత్వంలో పెద్ద ప్రమాదం ఏమిటి అంటే వాడికి వాడు స్వంతంగా ఆలోచించుకోలేడు, ఇతరులు చెపితే వినడు. వివేకం పెంచుకో,

ఆలోచన పెంచుకో, నీకు స్వంత ఆలోచన లేకపోతే మూర్ఖత్వంలో నుండి బయటపడలేవు.

ఏది విద్య అంటే నీహృదయంలో ఉన్న నిజాన్ని ఏదైతే పొందింపచేస్తోందో అదే నిజమైన విద్య. మానవుడు ఎప్పడైతే తన హృదయంలో ఉన్న నిజాన్ని, ఆనందాన్ని అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో అప్పడు బాహ్యమైన పరిస్థితులు, సంఘటనలు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నావాడి శాంతి చెదరదు ఎందుచేతనంటే వాడు శాంతికోసం బాహ్యమైన వ్యక్తులమీద, విషయాల మీద ఆధారపడి ఉండడు. అప్పడువాడు ప్రత్యేకంగా ఇతరులను అనుగ్రహించాలని అనుకోనక్కరలేదు. వాడి ద్వారా శాంతి, ఆనందము ప్రవహిస్తూ ఉంటుంది. వీరందరిని బాగుచేయాలని ప్రత్యేకంగా వాడికి సంకల్పం అక్కరలేదు. అక్కడ పసుపురాలుతోంది, ఇక్కడ కుంకుమ రాలుతోంది అనే గొడవలోనికి వెళ్లవద్దు. ఎవరు ఏది చెప్పినా ఈమాటలు ఎంతవరకు మనకు ఉపయోగపడతాయి అని మీరు సొంతంగా ఆలోచించుకోవాలి. సొంతంగా ఆలోచించుకొని వాటిని ఆచరిస్తే అది మీకు సొమ్ము అవుతుంది. శరీరం మరణించక ముందే నీహృదయంలో ఉన్న వస్తువును పట్టుకొన్నావు అనుకో నీకు అమృతత్వం కలుగుతుంది.

అన్ని భోగములు మన ఎదురుగా ఉన్నప్పటికి మనమనస్సులో వికారం రాకుండా చూసుకోవాలి. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ముఖ్యం. దానికి గురువు సహాయం అవసరం, ఈశ్వరానుగ్రహం అవసరం. మనకు ఏదైనా పది రూపాయలు కలిసి వస్తే లాభం అనుకొంటాము. నీకు భౌతికంగా వచ్చే లాభాలు అన్నీ స్వప్నంతో సమానము. నిజమైన లాభం, నీశరీరం మరణించినా నీకూడా వచ్చేలాభం ఏమిటి అంటే ఆత్మలాభం. ఆత్మ ఎవరు నువ్వే. అది తెలిస్తే సుఖపడతావు, తెలియకపోతే జన్మజన్మలకు దుంఖః నిన్నువెంటాడుతూ ఉంటుంది. నీహృదయంలో ఉన్న నిజం నీకు తెలియకపోయినా నీమనస్సు, నీదేహం నీకు తెలుస్తున్నాయి నీకు తెలుసున్న మనస్సును, దేహమును ఉపయోగించుకొని నీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. వ్యర్ధమైన చింతలతో, వ్యర్ధమైన కర్మలతో కాలమును పాడుచేసుకోవద్దు. కాలాన్నిసద్వినియోగం చేసుకోండి. మీరుపనిచెయ్యండి. తెలిసి చెయ్యండి. ఏరకంగా పనిచేస్తే మీరు బంధంలోనుండి విడుదల పొందుతారో అది తెలుసుకొని చెయ్యండి. మీరు ఆత్మానుభవం పొందితే అది నిత్యమైన లాభం. అయితే మోహంలో నుండి విడుదల పొందినవాడు, భ్రాంతిలోనుండి విడుదల పొందిన వాడు మాత్రమే ఆత్మలాభమును పొంధగలడు.

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహబాషణములు
21-2-99 - జిన్నూరు శ్రీ·రమణక్షేత్రం

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL